# మా ఆవిడ అలుక

"అప్పిచర్ల"

ప్రప్పుడే పడమటి గాలి ఆగి పైరు గాలి వీచుతుంది. కుడి ఎడంగా గాఢ బస్వరమయినా "చల్లగాలిలో యమునాతటిపై శ్యామసుందరుని మురళీ" అని కూని రాగాలు తీసుకుంటూ ఇంట్లోకి వచ్చా చూపులతో చికాకు వదలగొట్టే అర్ధాంగి యేదా అని చూచా. ఒకవైపున చింపి చాపమీద దశరథుడిని వరము లడుగబోయ్యే కైకే యిలా తల దువ్వకోకుండా ముడి, గాల్షన్ లో అమర్చినట్లుగా మెడచుట్టూ ఆభరణాలు అలంకారాలు లేకపోయినా వున్న కొద్దో గొప్పో తీసివేసి, చినిగిపోయిన చీరకట్టుకొని ఒకమూల కూర్చుండే తీసివేసిన మొండి చీపురులా వుంది. ప్రతిరోజూ నేను వచ్చే యీ సమయానికి గుణసుందరి బార్డరుఅంచు రవికె తొడుగుకొని, శ్రీ లక్ష్మమ్మ చీర కట్టుకొని ఒక్కొక్క రోజున అవీ నచ్చకపోతే గొల్లభామ గోటున్న బాలనాగమ్మ రవిక తొడుక్కొని స్వర్గసీమ సవరాలతో వ్రేలాడు జడవేసుకొని చంద్రలేఖ బిందెలతో తోటలో నీళ్లు పోస్తూవుండేది.

చూపులతో నా ఆనందాన్ని అయస్కాంతంలా ఆకర్షించేది కూర్చున్న ఆ కైకేయి పోజులో మంథర లేకపోవటం నా నెత్తిన పాలు పోసినట్లనిపించింది. ఒకటి, రెండు. మూడు అన్నారు గాబట్టి మూడుసార్లు అడిగా అంతకంతకు నీలుక్కోవటం జాస్తి అయింది. నేను మటుకు తక్కువ వాడినా అనిపించింది దాన్ని అడుగకుండానే కారణమేమిటో గ్రహించాలని గట్టిగా నిర్ధారణ చేసికొని విశ్రాంతికి, హాయికి, బుద్ధి వికాసానికి, మనోదార్ఢ్యతకు సిసలైన సిజర్ సిగరెట్టు వాడి చూడండి అనే బజార్లలో అరిచే అడ్వర్టయిజుమెంటు కేకలు వినబడ్డాయి. వాటికేం మనదగ్గర రెడీ గాబట్టి ఒకటి వెలిగించి రైలు లాగా పొగ వదుల్తూ కూర్చున్నా.

ఇన్నాళ్ళ నుండి కాపురం చేస్తున్నా ఇంత వరకు యిలా ధిమాయించి కూర్చోలా. ఇలా అలగటానికి అవివేకురాలు అజ్ఞానురాలు కాదు. చదువుకున్నది సంస్కారము కలది. విజ్ఞానము వివేకలది రూపవతి గుణవతి. ఇల్లు యిరకటం ఆలి మర్కటం అని పెద్ద లెప్పటినించో మొత్తుకుంటున్నారు. పెద్దలమాట చద్దిమూట అంటారు గదా అని నేను ఆ సామెత ప్రకారమే అనుసరించాలనుకున్నా. నాకు చిన్నప్పుడినుండి నల్లటి ఒళ్లు, ఎర్రటి కళ్ళు, తెల్లని పళ్ళువున్న పెళ్లాన్ని చేసుకోవాలని కోరిక, పెరిగి పెద్ద అయినతర్వాత మా చుట్టాలలో, స్నేహితులలో నల్లటి వాళ్ళని వివాహ మాడిన వారందరిని గేలుచేసే వాళ్ళం, నీ కెలాంటి రంభవస్తుందో చూస్తాంగా అనేవాళ్ళు ప్రతీకారంగా మావాళ్ళంతా. నాకు సంబంధాలు రావటం ఆరంభించినయి. రెండుమూడు కాన్సిల్ అయినాయి, కోడలు నలుపుఅయితే కులమంతా నలుపు, మాకు ఎర్ర పిల్ల కావాలని పట్టుబట్టారు మా వాళ్ళంతా నిజంగా ఎరుపయినా మంకీ బ్రాండ్ మాత్రం కాదు, అప్పుడు కాకపోయినా యిప్పుడీ అలిగిన యీ పోజులో మాత్రం అలా వుందనక తప్పదు. చూస్తుంటే నిరసన వ్రతము చేసేలాగుంది, మరి జాస్తయితే ప్రాయోపవేశము కూడా చేస్తుందేమో ననిపించింది.

ఇంతకీ నేను ఆలోచింపవలసిన కారణాలు దొరకటంలా. అంబాల్ నస్యం ఒక్క చిటిక వేసి బుర్ర గోక్కొని టకాటకా ఆలోచించా ఆ త్వరిత ప్రవాహంలో కొన్ని గబగబా ముందుకు పోయినవి, కొన్ని సగంవరకు వచ్చి ఆగిపోయినయి, జ్ఞాపకము వున్న కారణాలు కొన్ని రైటయి వుంటయ్యేమోనని తీవ్రంగా ఆలోచించా మరొక పీల్పు రాజన్ ముక్కుపొడితో త్వరలో, అతి త్వరలో విడుదలయిన లక్ష్మమ్మ, శ్రీ లక్ష్మమ్మ కథ సినిమాలు చూసింది. గుణసుందరి కథ, తిరుగుబాటు మొదలయిన తెలుగు చిత్రాలతోబాటు తదితర థియేటరులలో ఆడే అన్ని చిత్రాలు చూసింది. నా భార్య అంటే

మాడరన్! ఎడ్యుకేటెడ్ గరలు గదా అందువల్ల ప్రతి పత్రిక విడిచిపెట్టకుండా చదువుతుంది, ఐనా ఒకటవ లేదీకూడా రాలేదు, ఆ పత్రికల కోసమే మౌనముకుంటే లేక ఫిలిం బొలటు ఫలితాలు కైటయినందువల్ల వుత్సాహ దినోత్సవం చేద్దామనా - రాంగయినందువల్ల సంతాప దినోత్సవం చేద్దామనా లేక నేను అతిజాగ్రతగా వాడే త్యాగయ్య ధోవతులు, బాలరాజు వుత్తరీయ్యలు ధరించటం మానమనా! రాబోయే ముట్టు మూడు రోజులు క్యాజువల్ లీవుతో బాటు మరొక వారం రోజులు సిక్ లీవు గ్రాంటుచేసి పుట్టింటికి పంపించమనా నేటి స్వాతంత్ర భారత దేశములో స్త్రీ పురుషుల హక్కులు సమానం గాబట్టి చెరి పక్షం రోజులు తగువు లేకుండా వంట చేద్దామనా. ఆలిండియా యువతుల సౌకర్యార్థము అల్లుళ్ళంతా అత్తగారిండ్లలో వుండాలనా, పుట్టబోయే పిల్లకాయలకు పేరులు పత్రికల ద్వారా సెలక్టు చేయించి నిర్ణయించాలనా! రాబోయే సినిమాలకు తీసుకపోతారా లేదా అనా, క్రొత్త చీరెలు, రవికలు కావాలనా, కాపురానికొచ్చి యింతకాలమైనా గ్రేలాడుజడ, కాన్వాసు చెప్పులూ వేస్తూ వెలగుడుతో సినిమాలకు వెళ్ళుతుందని చుట్టుప్రక్కల వాళ్ళంతా హేళన చేస్తున్నారనా, ప్రొద్దుగూకులు కిటికీలో నిలబడి ఎదురింటి 21 యేళ్ళ వితంతువును చూస్తుంటానా, వాళ్ళ అమ్మ తమ్ముళమీద నాకు ప్రేమ లేదనా, పుట్టింటికి పంపించననా, నాతో కూడ ఆఫీసులో చేరి వుద్యోగం చేయాలనా, పని మనుషులను పెట్టమనా, తను యిప్పటినుంచి పనిపాట లేకుండా రాణిలాగా కూర్చోవాలనా

ఇప్పటికే నా బుర్ర యిన్ని కారణాలను వూరించ గలిగిందంటే నాకే ఆశ్చర్యమయింది, ఈ లోపల ఎన్ని సిజరు సిగరెటు పెట్టెలూ, ఎన్ని అంబాళ, రాజన్ నస్యపు చిటికలు ఖర్చయినయ్యో అంతులేదు. ఏం చెయ్యాలో చివరకు అర్థం కాలేదు.

ఏదో సినిమా బండి పోతూండే బయటికి వచ్చా. ప్రేక్షకులను తండోప తండములుగ తరలించుకు వస్తున్నది. వాహినీవారి గుణసుందరి కథ అని వ్రాసివుంది ఆ బండిమీద జానియర్ శ్రీరంజని, మాలతి, శాంతకుమారి, శివరావు రేలంగ వగైరా ఆ సినిమా జ్ఞాపకము వచ్చి శివరావు రెండవ యక్షిణిని నవ్వించాడు గదా అని జ్ఞాపకము వచ్చింది. అలాగే చక్కిలిగిలి పెట్టి నవ్విద్దామా అనుకొని అలా కోతి చేష్టలు చేయటం డిగ్నిటీకి లోపమనిపించింది, మళ్ళీలోపలికెళ్ళి గ్రుడ్డిలో మెల్లమేలు అన్నటులుగా యిటు వైపుకు తిరిగింది, శ్రీమతి లోపలమళ్ళీ నేను వెళ్ళిపోతున్నానని భయమెమో నేను వస్తున్న చప్పుడు తెలిసి మళ్ళి బిగించుక కూర్చుంది.

కృష్ణుడంతటివాడు సత్యభామకు దాసుడైనాడుగదా నేనొక లెక్కాజమా అనుకొని సంధికి బయలుదేరా.

దగ్గరను వెళ్ళి నుంచున్నా కొంచం మొగం యిటు త్రిప్పింది, మెడమీద చెయివేసి ప్రారంభించా "క్రొంజిగురాకు శ్రేణుకకు రుక ముడివేనుక కూరుచున్న అభ్యంజన మంగళాంగి! జడయల్లుదునా ఆనేసరికి సిగ్గుతో అభినయిస్తున్నట్లుగా యీవలకు వచ్చింది, నేనూరుకోకుండా

"చిటితాళం వేస్తినంటే - చిట్టంటులు
చేసినంటే
సిగ్గుకేలే సడలిపోవాలే!
జరంగు గంగుల రమణిరంగీ
రింగు రింగున ఎగిరిపోవాలే"

ఆనేసరికి పూత్తిగా నవ్వరాని నాపసన్యాసికాదు కాబట్టి నవ్వుముఖం పెట్టింది, ఇంకేం ఛాన్సు చిక్కిందిగదా అని లేచి నిల్చొన్న అర్థాంగి దగ్గరకు వెళ్ళా, అంతలో శ్రీ లక్ష్మమ్మ కథలో వెంకయ్యనాయుడి పోజు జ్ఞాపకము వచ్చింది; అదే పోజులో "నవ్వు, ఆగమన్నా ఆగదులే! చిందులు వేస్తుంది, పెదిమలు దాకా వచ్చింది; హుం నవ్వు అన్నా."

ఆ మాటలు పొంతం పూర్తి చేశానో లేదో అప్పుడే తారామండలం గా మండిపోయింది మా ఆవిడ ఆగ్రహం అప్పుడు చూస్తే చండికు, పాపారాయుడు లాగోవుంది, ఏం కొట్లాడుతుందో అని చెవులు నిక్కపొడుచుకొని వింటున్నా.

"ఆ సినిమా పోజులు, కలవరింతలు, కలలు పాటలు, వేషాలు" ఇకనుండి

మానమని చెప్పటానికై యిందాకటి నుంచీ నీ అలుకా అని అన్నానో లేదో రామూ బజారుకో రావూ అని మా శేషగిరిరావు కేకవినపడింది మంచి రసపట్టులో పిల్చాడే అనుకుంటూ ముఖ్య స్నేహితుడు, చిరపరిచితుడు కాబట్టి అతనితో బజారుకెళ్ళా."